కాని కాలం వస్తే...

ఫాతిమాబీబీ రెండు చేతులతో తలపట్టుకుని పెరట్లో చెట్టుకింద కూర్చుంది. కనుబొమలు కలుసుకుంటున్నాయి- వెంటనే విడిపోతున్నాయి. ఆమె కడుపులో నుంచి అలలు అలలుగా ఉవ్వెత్తున ఎగిసెగిపడుతున్నది ఉద్రేకం. కుమిలి కుమిలి పోతున్నదా ఉద్రేకానికి దేహం.

కాని- కంటికి నీరులేదు.

కొంతసేపటికి మోకాళ్ళమీద రెండు చేతుల మధ్య తలదాచుకున్నది.

చల్లటిగాలి వీస్తున్నది. కటిక చీకటిలో మనిషికంటికి కనబడకుండా చెట్టు చాటుకు కూర్చున్న ఫాతిమా దగ్గరికి- తనలో తానే కుమిలిపోతున్న ఆమెను పిల్ల గాలులు పలకరించిపోతున్నాయి

ఆమె ఆలోచనలకు దరీదాపూ కనబడటం లేదు.

జబ్బమీద చెయ్యిపడి అదుముతున్నట్లనిపించి త్రుళ్ళిపడ్డది.

"భయపడకు. నేను కాశీంను" ఆమె పక్కన చోటుచేసుకుని కూర్చున్నాడు.

"ఇంకా నిద్రపోలేదూ?" ఫాతిమా గొణిగినట్టుగా అడిగింది.

"నీవు నిద్రపోలేదూ?" అతడడిగాడు. జవాబుగా.

ఒకరినొకరు పలకరించుకోవటానికే ఆ మాటలు కాని-అతడికి తెలుసు ఆమె చీకటి పడగానే తిండీతిప్పలు లేకుండా ఆ చెట్టువెనక కూర్చుని కుమిలిపోతోందని. ఆమెకూ తెలుసు అతడు ఆ సాయంత్రం నుంచీ పిచ్చెక్కినట్టు తిరుగుతున్నాడనీ- ఒక పనికి బదులు ఒకపని చేసి యజమానులచేత చివాట్లు తింటున్నాడనీను.

తీసుకురమ్మన్న వస్తువు వెంటనే చేతికందివ్వ లేదని దొరచేత చెంపపెట్టు తిన్నాడు

కాశింకు తలపండిపోయింది. మోకాళ్లు వంగిపోయాయి. ఒక కన్నులేదు. దేహమంతా ముడతలు ముడతలుగా మెరుస్తూ ఉంటుంది.

ఫాతిమా కూడా ఇంచుమించు ఆ ఈడుదే. ఆమెకు పుట్టుకలోనే ఒక కాలు సొట్ట పోయింది. లావుగా ఉండటంవల్ల మరింత కుంటుతూ నడుస్తుంది. పండిన కేశజాలాన్ని ముడిగావేసుకుని తలమీదుగా కొంగు కప్పుకుంటుంది. చేతులకు రెండు వెండి మురుగులు తిరగకుండా బిగుసుకుని ఉంటాయి. చెవులకు ఏడెనిమిది బొడిపెలువంటి బంగారు పోగులు కింది నుంచి పైవరకూ ఉన్నాయి.

వీళ్లిద్దరూ పెళ్లికాగానే ఈ పాయగానవాబు అబ్దుల్‌రహమాన్ యింట్లో ఉండిపోయారు. కాశిం యింట్లో చిల్లర పనులన్నీ చేస్తాడు. ఫాతిమా పిల్లల పెంపకం చూస్తుంది. ఆమె ఆ మహల్లో అడుగుపెట్టిన తరువాతనే నవాబుకు ఇద్దరు కొడుకులు ఇద్దరు కూతుళ్లూ పుట్టారు. ఆమె చేతుల మీదుగానే పెరిగింది నవాబుగారి సంతానం. ఆఖరి పిల్ల నసీమ్ అంటే ఫాతిమాకు ప్రాణం.

ఫాతిమాకు పిల్లలులేరు. నవాబుగారి పిల్లలు కూడా అందరూ పెద్ద వాళ్లయ్యారు. ఫాతిమా ఇప్పుడు ఆడపిల్లల పనుల చేస్తూఉంటుంది. నసీమ్ ఖాళీగా ఉన్నప్పుడు ఫాతిమా ఏవేవో కబుర్లు చెబుతుంది. రాత్రిళ్లు ఆమె పడుకునే వరకూ కథలు చెబుతూ ఉంటుంది. ఆమె పడీపడీ నవ్వుతుంది.

"ఇటువంటివి ఎప్పుడయినా జరుగుతాయా ?" నసీమ్ పలువరస కనబడీ కనబడకుండా నవ్వుతూ అడుగుతుంది.

"ఎందుకు జరగవు. జరిగే ఉంటాయి" అంటుంది ఫాతిమా కళ్లు గుండ్రంగా తిప్పుతూ.

"పోపో నీ మాటలు ఎవరు నమ్ముతారు ?"

నసీమ్ అటువంటి కథలూ కబుర్లు ఫాతిమా నడిగి మరీ మరీ చెప్పించుకుని పదిహేడేళ్ల పిల్లయింది. ఫాతిమా మీద అది అభిమానమో పెంచిన ప్రేమో-అదేదో తెలియదుకాని-నసీమ్ ఫాతిమా మీద ఈగ వాలనీయదు. ఫాతిమాకు బట్టలు కొత్తవి-తను ఏరి ఏరి కొన్నవి తన పుట్టిన రోజునాడు ఇస్తుంది. అవి కట్టుకున్న ఫాతిమా నసీమ్ బుగ్గలు గదిలో ప్రేమతో పుణకాలి. అందరి ఎదురుగా సలామ్

చెయ్యాలి భయ భక్తులతో. ఫాతిమా ఏం తింటుందో రహస్యంగా వెళ్లి నసీమ్ చూస్తూ ఉంటుంది.

ఫాతిమా ఆలోచనలు నసీమ్ చుట్టూ తిరుగుతాయి. నసీమ్ తెల్లటి తెలుపూ కాదు-ఎరుపా అంటే ఎరుపూ కాదు. పసుపు తెలుపూ కలిపిన మేలిమి రంగు మీద గులాబీల పొడిచల్లి నట్టుంటుంది. ఆమె మొగల్ చక్రవర్తుల జవానాలో మహారాణి కుండే సౌందర్యంతో మిసమిసలాడుతూ ఉంటుంది. ఆమె అపూర్వంగా చెక్కిన గ్రీకు శిల్పంలా ఉంటుంది. ఆమె నవ్వినా అందమే-కోపగించినా అందమే ఒలుకుతుంది.

ఇటువంటి అపూర్వమైన రత్నానికి నవాబు ఎటువంటి సంబంధం తెస్తాడు?

నసీమ్ తల్లిని పోలింది. తల్లికి తగిన అందగాడు తండ్రి. మహమ్మదీయుల కుటుంబాలలో తల్లీ అక్క చెల్లెళ్లు మేనత్తలూ పిన్నమ్మ పెద్దమ్మలేగాని వరుడు పెళ్లి కాకముందు అమ్మాయిని చూసే ఆచారం లేదు. ఆడవాళ్లు పెళ్లి నఖ శిఖ పర్యంతమూ పరిక్షచేసి కాని పిల్లను ఎన్నిక చేయరు. వధూవరులు చెరొక గదిలో ఉండగా పురోహితుడు శాస్త్రం చదివి సంతకాలు చేయించుకుంటాడు గ్రంథంలో. ఆ గ్రంథం మసీదుల్లో భద్రపరచబడుతుంది. గదిలోకి వెళ్లిన తరువాత ముసుగు కప్పుతున్న వధువును ఆ ముసుగు తొలగించి అద్దంలో చూస్తాడు వరుడు. దానినే పహిలీనజర్ అంటారు. ఆ ప్రథమ వీక్షణములోనే సమ్మోహితుడవుతాడు వరుడు. అతడి చూపులో చూపు కలిపిన వధువు పులికించి విపకురాలవుతుంది.

నసీమ్‌కు అపురూప సౌందర్యవంతుడు ఎక్కడన్నా పుట్టే ఉన్నాడా అను కుంటుంది ఫాతిమా. నా తల్లిని సమ్మోహపరచగలవారెవరబ్బా? నవాబుగారి బంధుజాలంలో ఎవరైనా ఉన్నరా?

ఫాతిమా నవాబు కుటుంబాలలో పెళ్లిళ్ల యినప్పుడు కళ్లు ఇంతలు చేసుకుని చూసేది. రంగులో-రూపంలో ఎత్తులో లావులో-దేనిలోనూ ఆమె కోరైన యువ కుడే ఆమె కంటికి కనబడలేదు.

ఆమె మీదగల ప్రేమాతిశయం వల్లనా? లేక తగిన యువకుడు లేకనా? ఆమెకే పందేహంగా ఉండేది.

నసీమ్ అక్క- వహీదా. తేనెరంగు కళ్లు- ఎరుపుకు తిరిగిన తలవెంట్రుకలు- ఆమెదదొక తీరు అందం. ఆమె స్వభావం నసీమ్ స్వభావానికి విరుద్ధంగా కనబడేది. వాటిలో ప్రధానమైంది ఫాతిమా అంటే చిటపట.

"ఈ ముసలిదాన్ని తీసెయ్యరాదూ?" తలిదండ్రుల దగ్గర విసుక్కునేది.

"పాపం పెద్దది. ఉండనీ. మీ పనులు చేస్తోంది" తల్లి సర్ది చెబుతుంది.

"సెలవుల్లో వచ్చినప్పుడు పెద్ద కొడుకంటాడు- "బాబా, నేను లెక్కలన్నీ చూశాను. శిస్తు బాకీ లక్షలకు చేరింది. మనం చెల్లించి చాలా కాలమైంది. దీనికి మార్గమేదన్నా చూడాలి" సాలోచనగా తండ్రితో అంటూ ఉంటాడు. కాని- ఈసారి వచ్చినప్పుడు మరీ గట్టిగా చెప్పాడు.

"హైదరాబాదు సంస్థానం పరిస్థితి ఏం బాగాలేదు. నిజాం గారిని అందరూ తలకొకవైపుకు లాగుతున్నారు. ఎప్పుడో కేంద్ర ప్రభుత్వములో లీనము కాక తప్పదు. అప్పుడు మనవంటివారు చెంబూ తప్పేలా వదిలేసి పాకిస్తాన్ పారిపోవలసి వస్తుంది." హెచ్చరించాడు.

తల్లి భయంతో నోరు తెరిచింది. "అయితే మన మహల్ ఎట్లా? మన పాయగా గతి?"

నవాబు అబ్దుల్ రహమాన్ ఆలోచిస్తున్నాడు- "ఆ గొడవేదో తొందరగా జరిగితే బాగుండును. శిస్తు చెల్లించమని ఒత్తిడి ఎక్కువయింది. ఆ గొడవలో అడిగేవాడూ ఉండడు- ఇచ్చేవాడూ ఉండడు."

"బాబా, అట్లా అనకండి. దేనికదే. నేను మన మున్షీ దగ్గర కాగితాలన్నీ చూశాను. మీరూ చూసే ఉంటారు. భూములు జప్తు చెయ్యగా ఇంకా బాకీ చాలా ఉంది" అతడి ముఖం చాలా ఆందోళనగా ఉంది.

మరొకమాట అన్నాడు- "మన ఇంటి ఖర్చులు తగ్గించండి. కొందరు నౌకర్లను తొలగించండి. ఇంటిని సామాన్యంగా గడపండి. మేమిద్దరం హైదరాబాదులో కూడా ఇంటి ఖర్చు తగ్గిస్తాం. అంత ఇల్లు మా కిద్దరికీ అనవసరం. ఒక గదీ ఒక నౌకరు చాలు"

తల్లిముఖం దిగాలుపడటం చూశాడు. కాని అతడి మనసు మెత్తబడలేదు.

"తనఖాలో ఉన్న భూములన్నీ అమ్మండి. ముందు బేరాలు పెట్టండి. నేను ఈసారి సెలవుల్లో వచ్చినప్పుడు అంతా పరిష్కారం చేస్తాను"

అబ్దుల్ రహమాన్ గుండె బరువెక్కింది. కొడుకు ఉన్నది ఉన్నట్టు చెప్పగానే గుండె దడదడలాడింది. అతడు భరించలేకపోయాడు.

ఆ యింట్లో నౌకర్లు యజమానులు భోజనాలు చేసేటప్పుడుగాని హాల్లో కూర్చుని మాట్లాడుకునేటప్పుడుగాని ఎదురుగా ఉండరు కాని పిలవగానే పలికేటంత దూరంలో ఉంటారు.

నౌకర్లంతా ఇంటి సంగతి ఇంతో అంతో అర్థం చేసుకున్నారు.

"నౌకర్లను తగ్గించండి" పెద్ద బాబుగారు అన్నమాట అందరి చెవుల్లోనూ గింగురుమంటోంది."

ఎంత మందిని తగ్గిస్తారు?

ఎవరెవరిని?

ఎవరికి వారు తాము లేకపోతే ఇల్లు గడవదనీ తమను తీసివెయ్యలేదనీ నిర్ణయించుకున్నారు.

కాశీం ఫాతిమాల ముఖాలు వాడిపోయ్యాయి.

పెద్దబాబు అటు వెళ్లగానే సమస్య తీవ్రత తగ్గింది.

నౌకర్ల భయాలూ తగ్గాయి.

ఫాతిమా గుండెలు పీచు పీచు మంటున్నాయి. ఒకవేళ దొరలు వెళ్లిపొమ్మంటే తను నసీమ్‌ను వదిలిపెట్టి ఎట్లా ఉండగలదు? పోతే కాశీం ఎక్కడైనా పోవచ్చుగాని తాను పోలేదు.

ఫాతిమా అప్పుడప్పుడు నసీమ్‌తో అంటుంది-" అమ్మా, నిన్ను వదలిపెట్టి నేనుండగలనా?"

ఫాతిమా గుండెలోనుంచి ప్రేమాభిమానాలు పొంగిపోయేటట్టు నవ్వుతుంది. నసీమ్-కళ్లల్లో మెరుపులు కనబరుస్తూ.

డిసెంబరులో వెళ్లిన పెద్దబాబు ఫిబ్రవరి నెలలో హఠాత్తుగా ఊరిపడ్డాడు.

తండ్రి హృదయం గతుక్కుమన్నది

అతడి తాతలనాటి నుంచీ ఖాందాన్ (వంశ గౌరవ ప్రతిష్ఠలు) చూసుకుని జల్సాగా జీవించటమేగాని జమా ఖర్చులు చూసుకుని ఎరగరు. సంవత్సరం ఆఖరుకు దేనికి డబ్బు తక్కువయినా అప్పు చేస్తూ ఉంటారు. హైదరాబాదునగరంలో బట్టలు ఖాతా. మరే వస్తువులు కావాలన్నా ఖాతా-నగలు ఖాతా. మళ్లీ ఎప్పుడో వాళ్లు ఉత్తరాలు వ్రాసి, మనుష్యులను పంపి లేక స్వయంగా వచ్చి వడ్డీతో సహా వాయిదాలలో తీసుకు వెళ్లటం ఆచారం. దేనికయినా లేదు అనుకోకుండా డబ్బు ఖర్చు చేయటం ఆ కుటుంబానికి అలవాటు, ఇంట్లో ఏది తగ్గినా నౌకర్లను తీసివేసినా వంశ గౌరవానికి లోపం వస్తుందని భయం.

పెద్దబాబు నస్రుల్లాఖాను గరాజిలో ఉన్న కారును రాగానే బయటికితీశాడు. తండ్రీ తమ్ముడి సంతకాలు తీసుకున్నాడు. తమ పాయగాలో తనఖాలో ఉన్న భూములు పైట వాళ్లకు అమ్మాడు. భూములమీద ఉన్న అప్పు తీర్చాడు. హైదరాబాదు వెళ్లి అంత పెద్ద కారును అమ్మకానికి పెట్టాడు. అది చాలా పెద్ద కారు. వెనక సీటుమీద అయిదు మంది సులభంగా కూర్చోగలరు. డిక్కీలో ఒక సంసారానికి కావలసిన సామాను సులభంగా పడుతుంది. ఆ కుటుంబమంతా ఎంతో సౌకర్యంతో ఎంత దూరమయినా ప్రయాణాలు చేసే వారు ఆ కారులో.

ఆ కారును చూసి మోజుపడిన ధనికుడు వెంటనే కొన్నాడు.

పెద్ద బాబు కారు లేకుండా ఇంటికి రాగానే తల్లి డీలా పడిపోయింది. తండ్రికి నోట వెంట మాట రాలేదు.

నౌకర్లు పెదవులు చప్పరించుకుంటూ ఒదిగి నిలిచారు.

ఆ రాత్రికి తండ్రితో చర్చించాడు. ''రాష్ట్రంలో అల్లర్లు జరుగుతున్నా యథాతథపు ఒడంబడిక తరువాత పైకి సద్దుమణిగాయి. చెప్పీచెప్పక చాలా మంది.

పాకిస్తాన్ వెళ్ళిపోతున్నారు. మిగిలిన విషయాలు ఇక్కడ ఉండి నేనూ తమ్ముడూ చూసుకుంటాము. మీరు వెళ్ళిపోండి''

తండ్రి నిరుత్తరుడయ్యాడు.

''కావాలంటే తమ్ముడు మీతో వచ్చి మీకు కావలసిన వసతులు సమకూరుస్తాడు. నేనిక్కడే ఉంటాను'' ధైర్యం చెప్పాడు.

తండ్రి ఏ మాటకూ అడ్డు చెప్పలేదు. అవునూ కాదూ అనలేదు. కాని ''చూడు. ఈ ఆడపిల్లల పెళ్ళిళ్ల చేసి వెళ్ళిపోదాం.'' నీరసంగా ధ్వనించింది కంఠస్వరం.

''బాబా, మీతో చెప్పక దాచింది ఒకటే విషయం.'' కంఠం సవరించుకున్నాడు పెద్ద బాబు. చెప్పక తప్పదు. చెప్పలేకపోతున్నాడు.

''ఏమిటలా చూస్తావు? చెప్పు?'' తండ్రి భయం భయంగా చూస్తూ ప్రశ్నించాడు.

''మనం ఖాయం చేసుకున్న సంబంధాలు భూములమ్మగానే చెడిపోయాయి'' తల వంచుకున్నాడు.

''ఆఁ....'' తండ్రి విరుచుకుపడిపోయాడు. స్పృహ వచ్చినప్పటి నుండీ గుండెలు బాదుకోవటం మొదలుపెట్టాడు. మళ్లీ స్పృహ లేకుండా పోయింది.

ఆయన మనసును పీడించేవి రెండే విషయాలు. ఇద్దరు ఎదిగిన ఆడపిల్లలు. ఖాందాన్ ననుసరించి పెళ్లిచేయాలి. డబ్బులేదు ఎట్లా?

పెద్దబాబు పశ్చాత్తాప పడ్డాడు కారు అమ్మినందుకు. ఆ కారు ఉంటే తండ్రిని హైదరాబాదు హాస్పిటల్‌కు తీసుకువెళ్లటానికి వీలుగా ఉండేది. అయినా తను ఇంటి ఆర్థిక విషయాలు తండ్రితో కచ్చితంగా చెప్పకుండా ఉండవలసింది.

చెప్పక విధిలేదు

తెల్లవారు ఝామున తండ్రి ప్రాణంపోయింది.

ఇదంతా పెదబాబు తెచ్చిన ముప్పని ఇంటిల్లిపాదీ అనుకున్నారు. అతడిని శపించారు.

మతానుసారం నిలభయిరోజులు గడిపారు.

పెదబాబు ముఖం చూడటానికే తల్లి భయపడుతున్నది.

''అమ్మా. మనవాళ్ళు ధైర్యంగా ఇక్కడ ఉండే రోజులు గతించాయి. ఇక హిందువులు తిరగబడతారు. మనవాళ్ళమీద కక్ష దీర్చుకుంటారు. పరిస్థితులు ఒక మాదిరిగా ఉన్నప్పుడే మనం వెళ్ళిపోవాలి.''

''ఎక్కడికి?'' దుఃఖావేశంలో ఆమె గొంతు పైకి లేచింది.

''క్షేమకరమైన చోటికి.''

''ఏది?''

''పాకిస్థాన్''

''నా బిడ్డలు? వాళ్ళ పెళ్ళిళ్ళు? ఈ దేవిడీలో వైభవంగా జరగవలసిన పెళ్ళిళ్ళు ఎక్కడ చేస్తావు? ఎవరికిచ్చి?''

''అమ్మా'' అతడు తల్లిని కౌగలించుకుని బావురుమన్నాడు.

''ఈ పనులన్నీ నేను కావాలని చేయలేదమ్మా. ఇప్పుడు చెయ్యకపోతే మనగతి ఏమవుతుందో నేను చెప్పలేను. అందుకే ముందుగా జాగ్రత్తపడ్డాను. నీవూ తమ్ముడూ ముందుగా వెళ్ళిపోండి. తరువాత నేను వస్తాను. అక్కడ వ్యాపారం చేస్తాను.''

''మన అమ్మాయిలురా? వాళ్ళనెప్పుడు పంపుతావు? విడిగానా? వయసులో ఉన్న పిల్లలను వంటరిగా పంపుతావా? వద్దు- వద్దు.''

''నేనేదో చేస్తాగా? అమ్మా. ఇది విపత్కరమయిన పరిస్థితి. మహమ్మదీయులు హిందువులను ఎలా చిత్ర హింసలు పెట్టారో వాళ్ల కాలం వచ్చినప్పుడు హిందువులూ పెడతారు. ఆ కాలం వస్తోంది ఇన్నాళ్ల మాదిరిగా మనవాళ్ల ఆటలు సాగవు'' ముఖం పక్కకు తిప్పుకుని గంభీరంగా అన్నాడు.

"అయితే ఏమంటావు? వాళ్లనేం చేస్తావు"? కడుపులో పేగులు చుమ్మలు చుట్టుకుపోతున్నాయామెకు.

"ఏమన్నా అఘాయిత్యం తలపెడతావా? అసలు దేశంలో ఉన్నాయో లేదో గాని నీవు కొండంతలుచేసి చెప్పినందువల్లనే మీ నాయనగారు చనిపోయింది?" చీత్కారం చేసింది.

"అమ్మా, నీవు ఇంట్లో కూర్చుని అంతా బాగుందనుకోగానే సరా? మన వాళ్లు చేసే అఘాయిత్యాలు నీవు వినటం లేదు. గ్రామాలలో ఇళ్లు తగలబెడుతున్నారు. స్త్రీలకు మానభంగాలు చేస్తున్నారు. దోపిడీలుచేస్తున్నారు. ఒకటేమిటి? సర్వనాశనం చేస్తున్నారు. అదంతా కంటితో చూసిన వాళ్లు చెబుతున్నారు. మనం ముందే మేలుకోవటం మంచిది కదమ్మా. నీ కూతుళ్లకు ఆ గతి పట్టకుండా ఉండాలని నా తాపత్రయము."

ఆమె నేల మీద పడి దొర్లి దొర్లి ఏడ్చింది.

"ఇదంతా ఈ మహల్‌కు పట్టిన దుర్దశ. ఇన్ని తరాల నుంచి ఎంత వైభవంగా గడిచింది? మన ఖాందాన్ ఎటువంటిది? మన వంశం? గౌరవ ప్రతిష్ఠలు? అన్నీ ఈ నాటితో నేల మట్టమవుతాయా? మన వంశం ఇంక పేరూ ఊరూ లేనిదవుతుందా? ఈ మహల్-ఈ సామాను - ఈ నౌకర్లు-ఈ హోదా-ఈ వైభవం తరతరాలుగా అనుభవించిన మనం పాకిస్తాన్‌లో ఏం చేస్తాం? ఇవన్నీ ఎక్కడ సృష్టించుకుంటాము? ఈ మహల్లో నేననుభవించిన భోగాలు-విలాసాలూ-వినోదాలూ-సుఖసంతోషాలు ఇక నాకెక్కడివి? ఇక్కడ అమీర్ కుటుంబం అక్కడ గరీబ్ కుటుంబంగా బతకాలా? అమ్మాయిలకు వైభవంగా చేయవలసిన పెళ్లిళ్లు ఏ నవాబు కొడుకులనో అల్లుళ్లనుగా తీసుకురావలసిన ఇంటికి బిచ్చగాళ్లను తీసుకురావాలా? కాలు కింద పెట్టని సుకుమారులను రోడ్ల వెంట తిప్పాలా? నేను భరించలేను. చూడలేను ఈ కళ్లతో బాబూ. నాకింత విషమిచ్చి నీ పనులు నీవు చేసుకో" ఆమె స్పృహ తప్పి పడిపోయింది.

ఆమెను చూసి ఆడపిల్లలిద్దరూ గొల్లుమన్నారు మగపిల్లలు ఆమెకు ఉపచారాలు చేస్తున్నారు. నౌకర్లు చుట్టూ మూగారు.

ఆ మరునాడు వెండి బంగారు సామాను బట్టలు తీసుకుని తల్లితో చిన్న కొడుకు ప్రయాణమయ్యాడు. తల్లి వెళ్ళేటప్పుడు కూతుళ్ళిద్దరూ పైకి తల్లికి ధైర్యం చెప్పినా చాటుగా కుళ్ళి కుళ్ళి ఏడ్చారు. నౌకర్లు కంట తడిపెట్టారు.

తల్లి వెళ్ళిన తరువాత ఆ యిల్లంతా తిరిగాడు పెద్దబాబు. తాతలు కట్టించి సదా మహల్. ఆహాలులో పెద్దపెద్ద ఆర్చీలు_ నగిషీలతో ఎంత అందంగా ఉన్నాయి? పింగాణీ పలుకలు పరచిన వేల సీడలు కనబడుతూ ఉంది. ఎంతెంత పెద్దగదులు? వాటిలో ఎన్ని సామానులు? ఆ మంచాలు ఆ పరుపులు? ఎన్ని పెద్ద వరెండాలు? ఒక్కొక్క హాలుకు రెండేసి షాలిమర్లు_ కళ్ళు జిగేలు మనే కాంతి. మధ్య హాల్లో ఉన్న సోఫాలు బీరువాలు అపూర్వవస్తు జాలం_ఆపాలరాతి బొమ్మలు_ఆ సోగసులు! తిరిగి సమకూర్తాయా? తాతగారు కొన్నిటిని విదేశాల నుండి సేకరించారు. అతిథులకు ముందు వాటి అందాలను గురించి చెప్పేవారు. తరువాత ఎక్కడి నుంచి తెప్పించిందీ చెప్పేవారు. ఆ తరువాత వాటికింద ఎంత ఖర్చు చేసిందీ చెప్పేవారు. ఆ వస్తువులు చూడటానికే ప్రత్యేకంగా వచ్చేవారు చాలా మంది. వాటిని శుభ్రంగా తుడిచి కాపాడేటందుకు ఒక నౌకరు. అతడికి ఆ యింటి భోజనం_ ఆ యింటి బట్ట.

వికలమయిన మనసును కూడదీసుకుంటూ పెద్దబాబు తోటలో ప్రవేశించాడు. ఆ తోటలో లేని ఫలవృక్షంగాలి పూలచెట్లు గానిలేదు. వెనక పక్కగా పెద్ద ద్రాక్షతోట పూతమీద ఉంది పూలతోటకు మధ్యగా కొంగ రూపంలో పెద్ద ఫౌంటెను_ దాని కిరుపక్కల రంభా మేనకలవంటి అచ్చర భామలు_ ఆ ఫౌంటెన్ కెదురుగా అక్కడక్కడ కూర్చోటానికి సిమెంటు బెంచీలు_ తోటలో నడవటానికి నాపరాతితో బాటలు_ ఎత్తుగా పెంచి, గోడల పొదిరిగా చక్కగా కత్తిరించి పూల మొక్కలను ఏ రకానికారకం విభజనగా చూపించే బార్డరులు_ వాటికి దూరంగా ఆడవాళ్ళ కొకటీ మగవాళ్ళ కొకటీ, ఈత కొలనులు_వాటిలోకి దూకటానికి నిచ్చెనలు_ ఈతకొట్టిన తరువాత స్నానాలు చెయ్యటానికి బాత్‌రూములు. ఆ తోటమాలి చేతిక్రింద నలుగురు పాలేలు. నిత్యమూ ఆ తోటలో ఏదో ఒక పని జరుగుతూ ఉంటుంది. ఆ తోట క్రింద నెలకు పదిహేను వందల ఖర్చు. కొత్త చెట్లు ఎక్కడెక్కడినుంచో ఇంకా తెప్పిస్తునే ఉన్నారు. నాటుతునే ఉన్నారు.

ఈ భవనం! ఈ తోట!

రేపటితో తమకు, ఋణం తీరిపోతుంది వాటితో.

వాటిని కొనే వారు లేరు.

ఆద్దె కుండే వారు లేరు.

తాళం వేయటమొక్కటే మిగిలింది.

ఆ మాట అనుకుంటేనే గుండె కలుక్కు మంటున్నది.

ఒక్క చౌకీదారును మాత్రం ఉంచి మిగతా నౌకర్లందరికీ ఇవ్వవలసినది ఇచ్చి వెళ్లిపోమన్నాడు పెద్ద బాబు. మరునాడు హైదరాబాదుకు ప్రయాణం పెట్టు కున్నాడు చెల్లెళ్లతో.

కాశీం ఫాతిమా మున్షీలు తప్ప అందరూ పెద్దబాబుకు సలాము చేసి వెళ్లి పోయారు. వాళ్ల మరునాడు తెల్లవారకుండా వెళ్తారు.

ఫాతిమా పెద్దబాబును పెంచినది కనుక కొంత బెరుకు లేకుండా మాట్లాడ గలుగుతుంది ఆతడితో.

బాబూ, బీబీలను హైదరాబాదులో ఎక్కడికి తీసుకుపోతున్నారు?'' ఒంగి సలాము చేసి ప్రశ్నించింది.

పైకి గంభీరంగా ఒక్కొక్క సమస్యనూ పరిష్కారం చేసుకుంటూ పోతు నప్పటికీ సాదరంగా ఎవరయినా పలకరిస్తే కన్నీళ్లు దూకిపడేటట్టున్నాయి పెద్ద బాబుకు.

కనురెప్పలతో తడిని అదిమిపెడుతూ ''దారీ తెన్నూ తెలియటంలేదు. హైదరాబాదులో పురానా వంశంలో పుట్టిన యువకులిద్దరు నాస్నేహితులు. వాళ్లకిచ్చి పెళ్లి చేసే స్తోమత నాకు లేదు. వాళ్లకు పుట్టిన రోజు కానుకగా ఇస్తాను. ఆక్కడ తిండికి బట్టకు కొదువలేకుండా బ్రతుకుతారు. అంతకు తప్ప మార్గం తోచటం లేదు'' అతడు తల వంచగానే కన్నీటి బొట్లు నేలమీద పడ్డాయి

ఆ మాటలకు అదిరిపడ్డది ఫాతిమా.

''బాబూ. డబ్బుగల కుటుంబాలు. పురానా కుటుంబాలే. కాదనను. బీబీలు రాజభోగాలు అనుభవిస్తారు కాని- ఫ్రీగా సుఖపడలేరు. బాబూ. ఈ బిడ్డలను నా చేతుల మీదుగా పెంచాను. మహారాణులవుతారను కున్నాను. కాని బాబూ.

ఈ బంగారు తల్లులను పులులకు ఎరవేస్తారా, నసీమ్. ఎంత మంచి మనసుగల తల్లి? ఎంత సౌందర్యవతి? మీ తోబుట్టువులను మీ చేతులతో మీరే బలి చేస్తారా బాబూ? నేను చూడలేను. నేను చూడిలేను.'' కన్నతల్లి కంటె దీనాతిదీనంగా విలపించింది ఫాతిమా.

పెద్దబాబుకు అంతకంటె దుఃఖం పొంగి పొరలింది.

ఈ పుట్టినరోజు కానుకలు ఇచ్చి వాళ్లను చల్లబరచకపోతే వాళ్లకు బాకీ ఉన్న లక్షలు తీరేది ఎట్లా?

అదే పెద్దబాబును వేధించే ప్రశ్న.

ఫాతిమా అన్నమాట నిజమే. మొదటిరోజు ఆ యువకులు వీళ్ళ ముఖాలు చూస్తారు. తరువాత ఉంపుడు కత్తెల జాబితాలో చేరుస్తారు. మళ్ళీ వీళ్ళు ఎప్పుడు జ్ఞాపకానికి వస్తారో వాళ్ళకు?

తన చెల్లెళ్ళకు సంగీతమూ నాట్యమూ బాగావచ్చు. అంతమాత్రాన నాట్య కత్తెలుగా వాళ్ళ దగ్గరికి పంపటమా!

ఆ రాత్రి అతడికి భోజనం సహించలేదు. తోటంతా తిరిగి చెట్టుచెట్టునూ పట్టుకుని పొంగుతున్న ఆవేశాన్ని అణచుకుంటూ- ఇల్లంతా తిరిగాడు. కళ్ళారా ఆ మహల్‌ను చూసుకున్నాడు.

పట్టిపట్టి చూశాడు

ఇదంతా ఎవరూ చూడలేదనుకున్నాడు.

ఫాతిమా అంతా కనిపెడుతునే ఉంది.

ఆ రాత్రి అతడికి కలతనిద్ర- పలవరింతలు.

రాత్రి రెండు గంటలవేళ వహీదా లేచింది. తన బట్టలు ఒక సూట్ కేసులో పెట్టుకుంది. మెల్లగా అడుగులువేస్తూ నౌకర్ల గదులలో చివరిదాంట్లో ఉండే ముష్తీ గది తలుపు తట్టింది.

అతడు తలుపు తెరిచి ఆమెను చూసి తెల్లబోయాడు.

ఆమె గదిలోకి వెళ్లి తలుపువేసి "మున్షీసాబ్. మీ దగ్గర డబ్బు ఎంత ఉంది?" అడిగింది.

"నిన్న పెద్దబాబు అందరికీ జీతాలు ఇచ్చారు. ఏడాది జీతం అంటే పన్నెండు వందలు ఉంది" ఆశ్చర్యపడుతూ చెప్పాడు.

"మున్షీసాబ్ మనం ఈరాత్రి హైదరాబాదు వెళ్దాం. మీకు అభ్యంతరం లేకపోతే నన్ను వివాహం చేసుకోండి" తలవంచుకుంది.

మున్షీ విభ్రాంతుడై పోయాడు. తనకు నలభై ఏళ్లు దాటాయి. అటూ ఇటూ ఎవరూ లేరు. ఈ యింట్లోనే చిన్నప్పటి నుండీ పెరిగాడు వాళ్లిచ్చిన బట్ట-వాళ్లు పెట్టిన అన్నం ఈ దేహాన్ని వాళ్లే పెంచారు. వాళ్లే నాలుగు అక్షరమ్ముక్కలు అంకెలు నేర్పించారు. కొంచెం పెద్దవాడయిన తరువాత లెక్కలు రాస్తే నెలకు నూరు రూపాయలు ఇస్తానని నవాబు అన్నాడు అలా కాలం గడుస్తోంది.

వహీదా బి.ఏ , ప్యాసయింది. పర్షియన్ భాషలో పండితురాలు. సంగీత నాట్య కళలలో నిధి. హైదరాబాదు స్త్రీల కళాశాలలో అక్క చెల్లెళ్లిద్దరూ ఫాతిమాతో కాపరంపెట్టి విద్యనభ్యసించారు. తిరిగి ఇంటికి వచ్చి ఏడాది అయింది

వహీదా అందం ముందర మున్షీ వెలవెలబోతాడు.

అతడికెన్నో సందేహాలు. పెద్దవాళ్లకు తెలిస్తే తన తల తీసేస్తారు. ఆమె నవాబు కూతురు తను నిరుపేద.

"మున్షీసాబ్. ఎందుకు సందేహిస్తున్నారు? మూడు గంటలకొక బస్సు న్నది. ఆలోచించకండి. ఆపత్కాలంలో ఆలస్యం చేస్తే ఈ అవకాశం కూడా జారి పోతుంది. నేను మీకు నచ్చలేదా?" సూటిగా అతడి కళ్లల్లోకి చూసింది.

"నన్నూ-నా పరిస్థితులనూ మీకు తెలిసే అడుగుతున్నారా?"

"అవును మున్షీ సాబ్. నేను హైదరాబాదు నవాబుల ఇళ్లలో నాకు వచ్చిన విద్యలు నేర్పి డబ్బు సంపాదిస్తాను. మనకు హైదరాబాదులో ఎటువంటి భయమూ ఉండదు. మీ బట్టలు ఒక పెట్టెలో సర్దుకోండి. నా పెట్టెలో ఇంకా కొంత చోటున్నది."

అతడికి ఒక చేతి సంచీ తప్ప మరేంలేదు. బట్టలు మాత్రం నాలుగు జత లున్నాయి. ఆమె గబగబా వాటిని ఆ చేతి సంచీలో కుక్కింది. గది బైటికి వచ్చి తలుపు గొళ్లెం చప్పుడు కాకుండా పెట్టారు. అడుగులు గబగబ వేస్తూ మహల్ దాటారు.

ఫాతిమా కిటికీలోనుంచి వీళ్లిద్దరినీ చూసింది. కళ్లు చెమర్చాయి. కాశీంను పిలిచి చూపించింది. అతడు ఆశ్చర్యంతోనూ విచారంతోనూ ఆఁ? అంటూ నిల బడిపోయాడు.

"ఇప్పుడు నసీంను ఏంచేద్దాం? వహీదా వంటి తెగువతనం లేని పిల్ల." ఫాతిమా ఆందోళన పడుతోంది.

కాశీం తెల్లవెంట్రుకల గడ్డం వణికింది. "నసీమ్‌ను తీసుకుని బెంగుళూరు వెళ్దాం. ఎక్కడో ఒకచోట తల దాచుకుని బీబీకి వచ్చిన విద్యలతో కాలక్షేపం చెయ్యాలి కొంత కాలం. తప్పదు" అన్నాడు.

తెల్లవారుఝామున, కాచిగూడా స్టేషన్ నుండి బెంగుళూరు వెళ్లే రైలు ఆ స్టేషనుకు వస్తుంది. కాళ్లకు పసుపు పూసుకుని, ముఖానికి పావలా కాసంత బొట్టు పెట్టుకుని సామాన్యమైన చీరె కట్టుకుని మామూలు చెప్పులతో నసీమ్ తయా రయింది. తన బట్టల సూట్‌కేసుతో బయలుదేరింది. ఆమె నౌకర్లుగా కాశీం ఫాతి మాలు పాత ట్రంకు పెట్టెలలో బట్టలు కుక్కుకుని బయటికి వచ్చారు. కాలినడకన స్టేషన్ చేరుకుని రైలెక్కారు.

కాశీం ఫాతిమాల దగ్గరున్న డబ్బులో జీవితాలు గడవాలి. ఈ ముగ్గురూ హిందువులుగా సింధీవాళ్ల మాదిరిగా మసలుకోవాలి. బెంగుళూరు వంటి నగరంలో ఈ మూడు జీవాలూ ప్రాణాలు నిలుపుకోవటమెట్లా అన్న ఆలోచనలు ఎవరికి వారు చేసుకుంటున్నారు.

"తల్లీ. నీవు వీధిముఖం చూడకుండా నిన్ను కాపాడుతాను. నీచేతి పనులు ఇంటింటికీ పోయి అమ్ముతాను. కాళ్లకు పసుపు రాసుకొమ్మన్నానని దుఃఖపడకు. మన మతం మనదే. అదెక్కడికి పోతుంది? మళ్లీ మనకు మంచిరోజులు తప్ప కుండా వస్తాయి." ఫాతిమా ధైర్యం చెబుతోంది.

నసీమ్ తల వంచుకుని పసుపు రాసుకున్న పాదాలను చూసుకుంటోంది.

నిశ్శబ్దంగా ఉన్న ఆ మహల్లో ఉదయం ఏడుగంటలకు పెద్దబాబు పక్కమీద పడుకుని "ఫాతిమా! కాశీం!" అంటూ కేకలు పెట్టాడు మామూలుగా.

ఎవరు పలుకుతారు?

చెప్పులు తొడుక్కుని చేతిసంచితో గేటు దాటుతున్న చౌకీదారు వెళ్ళుతున్నానని చెప్పటానికి వెనక్కు తిరిగాడు.

(ఆలిండియా రేడియో)